క్లుప్తంగా

పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు



నిడదవోలు వద్ద నిండుగా ప్రవహిస్తున్న పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: ఖరీఫ్ సాగు అవసరాల కోసం డెల్టా కాలువలకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు దశలవారీగా నీటిని విడుదల చేస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు ఆదివారం 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తూర్పుడెల్టాకు 1590 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1140 క్యూసెక్కులు వదిలారు. పశ్చిమ డెల్టాలో ఇప్పటికే ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంట పొలాల్లో దమ్ములు, నారుమడుల పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. డెల్టా శివారు భూములకు కూడా నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

20న సమిశ్రగూడెంలో విద్యార్థులకు ఎంపిక పోటీలు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో అడ్మిషన్ల కోసం మండలంలోని బాలబాలికలకు ఈనెల 20వ తేదీ ఉదయం 9 గంటలకు సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.సామ్యూల్ ఆదివారం తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులందరూ 4, 5 తరగతుల విద్యార్థులై ఉండాలన్నారు. ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు కూడా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 30 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్‌లో విద్యార్థుల ప్రతిభతో పాటు వారి ఎత్తు, బరువును పరిశీలించి రాజమహేంద్రవరంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంపీడీఓ వివరించారు.


20న క్రిస్టియన్‌పేటలో మెగా దంత వైద్య శిబిరం



కొవ్వూరులో ప్రచారం నిర్వహించడానికి వచ్చిన జీఎస్ఎల్ వైద్య కళాశాల విద్యార్థులు

కొవ్వూరు: స్థానిక క్రిస్టియన్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ఈనెల 20న మెగా దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ విక్రమ్ తెలిపారు. పట్టణానికి చెందిన రావి విశ్వేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాజానగరానికి చెందిన జీఎస్ఎల్ మెడికల్ కళాశాల వైద్యులు శిబిరంలో సేవలు అందిస్తారన్నారు. ఈ దంత వైద్య శిబిరంపై జీఎస్ఎల్ వైద్య కళాశాల విద్యార్థులు ఆదివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు.

అమ్మో... ఆ కిలోమీడర్





తాళ్లపూడి బజార్ సెంటర్‌లో వాహనాలతో రద్దీ

- ఆ మార్గంలో ట్రాఫిక్ పద్మవ్యూహం
- ఆక్రమణలతో పెరుగుతున్న చిక్కులు
- నిబంధనలు పాటించని వాహనదారులు

తాళ్లపూడి: సరిగ్గా.. ఆ కిలోమీటరు దారిలో ప్రయాణమంటే ప్రహసనమే.. ఆగి ఆగి ముందుకు వెళ్లాల్సిందే.. గమ్యం చేరుకునేలోగా విసుగెత్తిపోవాల్సిందే.. ట్రాఫిక్ సమస్యలతో తాళ్లపూడి మెయిన్ రోడ్డుపై చిక్కులు తప్పడం లేదు. వాహనాల రద్దీ పెరగడం, రోడ్డు ఆక్రమణలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం వంటి కారణాల వల్ల సమస్య నానాటికీ జటిలం అవుతోంది. ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాళ్లపూడి బస్టాండ్ నుంచి ప్రక్కిలంక మలుపు వరకూ సుమారు కిలోమీటర పొడవునా ఆర్ అండ్‌బీ రోడ్డుపై దాదాపు రోజూ ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఇక్కడి వ్యాపారులు తమ దుకాణాలను రోడ్లపైకి విస్తరించారు. మండల కేంద్రం, వ్యాపారి కూడలి అయిన తాళ్లపూడికి పోలవరం, గోపాలపురం, కొవ్వూరు మండలాల నుంచి ఎక్కువగా జనం వివిధ పనులపై వస్తుంటారు. దీనికితోడు రాజమహేంద్రవరం, నిడదవోలు తదితర ప్రాంతాలకు తాళ్లపూడి మెయిన్ రోడ్డు మీదుగా నిత్యం వందలాది మంది వాహనాలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇదే రోడ్డుపై భారీ వాహనాలు, ఊక, ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. దాంతో తాళ్లపూడి బజార్ సెంటర్లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఆక్రమణల చెరలో ఆర్ అండ్ బీ రోడ్డు

తాళ్లపూడి బజార్ సెంటర్లో ఆర్ అండ్ బీ రోడ్డు ఆక్రమణకు గురైంది. గతంలో సుమారు 80 అడుగుల వెడల్పున ఉండే ఈ రోడ్డు ప్రస్తుతం సుమారు 40 అడుగులకు తగ్గిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఆక్రమణల తొలగింపునకు 26 ఏళ్ల ఆర్ అండ్ బీ అధికారులు ఉపక్రమించారు. రాజకీయ ఒత్తిళ్ల వల్ల అప్పట్లో పూర్తిస్థాయిలో ఆక్రమణల తొలగింపు జరగలేదు. మళ్లీ 2010లో అప్పటి సర్పంచ్ ఆక్రమణల తొలగింపునకు పంచాయతీలో తీర్మానం చేసి తహసీల్దార్‌కు పంపించారు. అనంతరం సర్పంచులు మారడంతో సమస్య అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత ఆక్రమణల తొలగింపునకు ఎవరూ శ్రద్ధ చూపకపోవడంతో క్రమంగా ట్రాఫిక్ రద్దీ పెరిగి సమస్యగా తీవ్రతరం అయ్యింది. ఆరేళ్ల క్రితం ఆర్ అండ్ బీ, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా సర్వే జరిపి రోడ్డు కొలతలు తీసుకున్నారు. మార్కింగ్ కూడా వేశారు. దాంతో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తారంటూ అప్పట్లో పెద్ద చర్చ సాగింది. ఆక్రమణదారులు కూడా కలవరం చెందారు. కారణం ఏమైందో తెలియదు గాని, అధికారులు మళ్లీ దీనిపై నోరు మెదప లేదు. తర్వాత వ్యాపారులు పోటీ పడి రోడ్డు పైకి దుకాణాలు విస్తరిస్తున్నారు. అయితే ఇక్కడ డ్రైన్ కూడా సమస్యగా మారింది. ఇటీవల రోడ్డు ఆక్రమణలపై , డ్రైన్ నిర్మాణంపై స్పందనలో సైతం స్థానికులు ఫిర్యాదు చేశారు.

నిబంధనలు బేఖాతరు

ఇటీవల తాళ్లపూడిలో ఆటోల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఎక్కడబడితే అక్కడ అడ్డదిడ్డంగా ఆటోలను నిలిపివేస్తున్నారనే అపవాదు వాటి నిర్వాహకులపై ఉంది. వెనుక నుంచి వస్తున్న వాహనాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఆటోల డ్రైవర్లు షడన్‌గా బ్రేక్ వేస్తుంటారు. ఇలాంటి చర్యలు పలు సందర్భాల్లో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న లారీలు, ఆటోల నిర్వాహకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బజార్ సెంటర్‌లో పార్కింగ్ సౌకర్యం లేదు. దాంతో షాపుల వద్దకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు.

మెయిన్ రోడ్డు ఆక్రమణలతో..



బజార్లోని మెయిన్ రోడ్డు ఆక్రమణలకు గురైంది. ఇది ట్రాఫిక్ సమస్యకు కారణమై ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోడ్డు పై దుకాణాలు పెట్టడంతో పాటు అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపి వేస్తున్నారు. భారీ వాహనాలు, లారీలు బజార్ సెంటర్‌లోకి రాకుండా చూడాలి. ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గూడా విజయరాజు, తాళ్లపూడి

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు



తాళ్లపూడి మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. రద్దీ ప్రాంతాల్లో వాహనదారుల నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. బజార్ సెంటర్‌లో దుకాణదారులు రోడ్డు పైకి రాకూడదు. ఆటోలు కూడా రోడ్డుపై అడ్డంగా నిలపకుండా చర్యలు తీసుకుంటాం.

– కె. వెంకటరమణ, ఎస్సై తాళ్లపూడి

భద్రయ్య వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ సాయం



భద్రయ్యకు రూ.15 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: ప్రాణం మీదకు వస్తే నిరుపేదలు కూడా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ పెరవలి గ్రామ శాఖ అధ్యక్షుడు పసలపూడి భద్రయ్య ఆరోగ్యం దెబ్బతింది. దాంతో ఆయన రూ.లక్షలు ఖర్చు చేసి ఇటీవల హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో లివర్ మార్పిడి, గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. పేదవాడైన భద్రయ్య వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తానికి చెక్కును లబ్ధిదారుడు భద్రయ్యకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శనివారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పెరవలి ఎంపీపీ కార్నెద్ర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు నక్కా పాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు ముందస్తు బిల్లులు

కొవ్వూరు: జగనన్న గృహ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ముందుస్తుగా రూ.20 వేల బిల్లు అందిస్తున్నామని గృహనిర్మాణ శాఖ డీఈఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. జగనన్న కాలనీల్లోను, సొంత స్థలాల్లోను ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పునాది నిర్మాణానికి ముందుకు వస్తే రూ.20 వేలు, బేస్‌మెంటు వేసుకుని నిర్మాణ పనులకు అవసరమైతే రూ.20 వేల చొప్పున ముందస్తుగా బిల్లు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 800 మంది లబ్ధిదారులకు ఈ విధంగా అందజేశామన్నారు. ఇప్పటి వరకూ కొవ్వూరు పట్టణంలో పరిధిలో 487 మందికి, మండలంలో 63 మందికి, తాళ్లపూడి మండలంలో 168 మందికి, చాగల్లు మండలంలో 82 మందికి ఈ సాయం అందజేశామన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

చాగల్లు: పంటల వేయడానికి ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని మండల వ్యవసాయాధికారి కె.వేణుగోపాల్ సూచించారు. భూసార పరీక్షలపై మండలంలోని బ్రాహ్మణగూడెంలో రైతులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకుంటే భూమి సారం ఎంత ఉంది? ఎలాంటి ఎరువులు వాడాలి? ఏయే పంటలు సాగు చేయాలనే విషయాలు తెలుస్తాయన్నారు. తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులను సాధించవచ్చని పేర్కొన్నారు. జింక్ లోపాలను సరిచేసే విధానాలను వివరించారు. గతంలో నిర్వహించిన భూసార పరీక్షల ఫలితాల వివరాలను ఏవో రైతులకు తెలియజేశారు.

23 నుంచి జగనన్న సురక్ష పథకం

- అక్కడికక్కడే సమస్యల పరిష్కారమే లక్ష్యం
- నెల పాటు కొనసాగనున్న కార్యక్రమం
- అవగాహన సమావేశంలో ఎంపీడీవో రాజశేఖర్



జగనన్న సురక్ష పథకంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాజశేఖర్

నల్లజర్ల: 'జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా ఈనెల 23 నుంచి జూలై 23 వరకూ నెలపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'జగనన్న సురక్ష' అనే కార్యక్రమాన్ని చేపడుతోందని ఎంపీడీఓ రాజశేఖర్ చెప్పారు. ఈ పథకంపై వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శనివారం సాయంత్రం అవగాహన కల్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ అక్కడికక్కడే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిందన్నారు. ఈ కార్యక్రమం విధి విధానాలు, ఉద్దేశాలు, అమలు తీరు గురించి ఆయన వివరించారు. రోజుకొక సచివాలయం, వారంలో మూడు రోజుల చొప్పున ఐదు వారాల పాటు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఒకటి, తహసీల్దార్ ఆధ్వర్యంలో మరొకటి చొప్పున అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో అర్హులకు పథకాలు అందలేదన్న ప్రసక్తే ఉండకూడదన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మండల ప్రత్యేకాధికారి బాలస్వామి, తహసీల్దార్ కిశోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆదాయం రూ.90 వేలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన చల్లా చంద్రరావు, అనంతలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో 100 లీటర్ల పెరుగుతో చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకం ద్వారా రూ.90,428 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు.

ఆణిముత్యాలుగా గురుకుల విద్యార్థులు



ఆణిముత్యాలు అవార్డులు పొందిన తిరుగుడుమెట్ట విద్యార్థులు

తాళ్లపూడి: మండలంలోని వాడలపల్లి గురుకుల పాఠశాల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు గురుకుల విద్యార్థులు జిల్లా స్థాయి ఆణిముత్యాలు పురస్కారాలు గెలుచుకున్నారు. వారిద్దరూ కూడా మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామస్తులు కావడం విశేషం. ఈ గ్రామానికి చెందిన బర్రి రత్నప్రకాష్ 545 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం రూ.50 వేల నగదు బహుమతి అందుకున్నాడు. అలాగే కోట చైతన్య 518 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో మూడో స్థానం సాధించి రజత పతకం, రూ.15 వేల నగదు బహుమతి పొందారు. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో వారిద్దరూ ఈ పురస్కారాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు వీటి విల్సన్ రాజ్, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రాధిక , ఉపాధ్యాయులు జంగా లక్ష్మి, సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు వారికి అభినందనలు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రజ్ఞకు 3,427వ ర్యాంక్



గద్దే పూజిత ప్రజ్ఞ

చాగల్లు: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మండలంలోని కలవలపల్లికి చెందిన గద్దే పూజిత ప్రజ్ఞ 3427 ర్యాంక్ సాధించింది. ప్రజ్ఞ ఇంటర్ ఎంపీసీలో 987 మార్కులు సాధించడమే గాక తెలంగాణ ఎంసెట్‌లో 90వ ర్యాంక్, ఏపీ ఎంసెట్‌లో 136వ ర్యాంక్, జేఈఈ మెయిన్స్‌లో 1087 ర్యాంకులు కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా పూజిత ప్రజ్ఞ విలేకరులతో మాట్లాడుతూ బీటెక్ (సీఎస్ఈ) పూర్తి చేసి రక్షణ రంగంలో సేవ చేయాలనేదే తన లక్ష్యం అని చెప్పింది.

భూములు కౌలుకు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

[illegible]

క్ర. సం.	భూమి ఉన్న గ్రామం	రి.సర్వే.నెం	విస్తీర్ణం ఎ.సెం	ప్రథమ ధరావత్తు మొత్తం రూ.	వేలం జరుగు ప్రాంతము, తేదీ,సమయము.
1	పోతవరం	611.814	7.00	20000/-	శ్రీ సీత రామ స్వామి వారి ఆలయం లో ది.01.07.2023 వ తేదీన ఉదయం 11.00 గంటలకు
2	పోతవరం	[illegible]	12.58	25000/-	
3	పోతవరం	610	12.50	25000/-	
4	పోతవరం	144/2	7.00	20000/-	
5	పోతవరం	47/1.47/2	1.90	5000/-	

[illegible]

గ్రామం : పోతవరం
తేది: 17.06.2023

యం.లక్ష్మి శరణ్య
కార్యనిర్వహణాధికారి

భూములు కౌలు హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

[illegible] 2023 - 2024 నుండి 2025-2026 వరకు [illegible]

1. శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానం, పిట్టల వేమవరం గ్రామం

క్ర. సం.	భూమి ఉన్న గ్రామం	రి.సర్వే.నెం	విస్తీర్ణం ఎ.సెం	ప్రథమ ధరావత్తు మొత్తం రూ.	వేలం జరుగు ప్రాంతము, తేదీ,సమయము.
1	పిట్టల వేమవరం	160/5	0.89	2000/-	[illegible]

2. శ్రీ పోలేరమ్మ & మహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానం, పిట్టల వేమవరం గ్రామం

క్ర. సం.	భూమి ఉన్న గ్రామం	రి.సర్వే.నెం	విస్తీర్ణం ఎ.సెం	ప్రథమ ధరావత్తు మొత్తం రూ.	వేలం జరుగు ప్రాంతము, తేదీ,సమయము.
1	పిట్టల వేమవరం	228 74/1 148/16	0.19 1.99 0.58 2.76	3000/-	[illegible]

[illegible]

గ్రామం : పిట్టల వేమవరం
తేది: 18.06.2023

యం.వి.వి. శ్రీనివాస రావు
మేనేజర్
[illegible]







వేగేశ్వరపురంలో నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్రాలయం వైద్యులు సుమారు 100 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లు అందజేశారు.

బాలికను వేధిస్తున్న బాలుడిపై కేసు

సీతానగరం: ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇనుగంటివారిపేటలో స్నేహితుల వద్దకు కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన బాలుడు తరచూ వస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలో బాలికను ప్రేమించాలని వేధిస్తున్నాడు. శనివారం కూడా ఇనుగంటివారిపేట వచ్చాడు. అమ్మమ్మ ఇంటికి వెళుతున్న బాలిక నోరు, గొంతు నొక్కి, పాడుబడిన భవనంలోకి తీసుకువెళ్లి తలను గోడకేసి కొట్టాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బ్లేడ్ తీయగా బాలిక భయంతో కేకలు వేసింది. దీంతో బాలుడు పారిపోయాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

రాయితీలు వినియోగించుకోండి

చాగల్లు: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కలవలపల్లి పశువుల ఆసుపత్రి వైద్యుడు జీఎస్ఎం రాజేష్ సూచించారు. పశుబీమా పథకంపై ఆదివారం ఎస్.ముప్పవరం రైతులకు అవగాహన కల్పించారు. పాడి పశువులను కోల్పోయిన రైతులను ఆర్థికంగా పశు బీమా పథకం ఆదుకుంటుందన్నారు.

శ్రమిస్తాం.. లక్ష్యాలను సాధిస్తాం

ఉండ్రాజవరం: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో మండలంలోని శశి వేలివెన్ను విద్యాసంస్థ విద్యార్థులు సత్తా చాటారు. ఇక్కడి సుశిక్షితులైన అధ్యాపకుల మార్గనిర్దేశకత్వంలో నిబద్ధత, అకుంఠిత దీక్షతో చదివి, మెరుగైన ర్యాంకుల సాధించారు. మరింత శ్రమించి, తాము అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని పేర్కొన్నారు. ర్యాంకర్ల మనోగతాలు, వారి కుటుంబ నేపథ్యాలు వారి మాటల్లోనే..

ఐఏఎస్ నా లక్ష్యం



నాపేరు పి.జయచంద్ర. మాఊరు నీలాద్రిపురం, తాడేపల్లిగూడెం మండలం. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 151వ ర్యాంక్ సాధించాను. నా తండ్రి పులుముల విశ్వేశ్వరరావు వ్యవసాయం చేస్తారు, తల్లి విజయరత్నం గృహిణి. ఐఏఎస్ కావాలన్నది నాలక్ష్యం.

పి.జయచంద్ర, 151వ ర్యాంక్

శాస్త్రవేత్త కావాలనేది నా లక్ష్యం



నాపేరు పితాని మోహిత్ సత్యసాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 394వ ర్యాంకు సాధించాను. నా లక్ష్యం ఐఐటీలో సీటు సాధించి శాస్త్రవేత్త కావాలని. మా ఊరు పితానివారిపాలెం, పెనుగొండ మండలం, నాతండ్రి పితాని శ్రీనివాసరావు పెనుగొండ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరర్, తల్లి లక్ష్మీదుర్గ గృహిణి.

పితాని మోహిత్ సత్యసాయి, 391వ ర్యాంక్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతాను



నాపేరు డి.నితిన్. మా ఊరు పెరవలి మండలం తీపర్రు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 443వ ర్యాంక్ సాధించాను. నా తండ్రి పేరు హరినాథ్‌బాబు పౌల్ట్రీఫారం నిర్వహిస్తారు. తల్లి వెంకటలక్ష్మి గృహిణి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనుకుంటున్నాను.

డి.నితిన్, 443వ ర్యాంక్

వరుణ కటాక్షానికి కడియాలమ్మకు పూజలు



వర్షాలు కురవాలని కోరుతూ గ్రామదేవత కడియాలమ్మను ఊరేగిస్తున్న దేవరపల్లి గ్రామస్తులు

దేవరపల్లి: వరుణుడు కరుణించి వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ ప్రజలు ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. మృగశిర కార్తె ప్రవేశించి పది రోజులు పైబడినా ఇంత వరకూ తొలకరి వర్షాలు కురవక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవకపోతే వ్యవసాయ పనులు ఆలస్యం అవుతాయని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం దేవరపల్లి గ్రామస్తులు గ్రామదేవత అయిన కడియాలమ్మ వారికి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం వద్ద పాలు పొంగించి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతను గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారికి చలివిడి, పానకాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేశారు. గ్రామంలోని మూడుబొమ్మల సెంటర్లోని పుంతలో ముసలమ్మ ఆలయం, బీసీ కాలనీలోని కృష్ణుడి ఆలయం వద్ద పాలు పొంగించి పూజలు నిర్వహించారు.

నేడు దేవరపల్లిలో 'స్పందన'

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి జి. రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరవుతున్నట్టు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యను అర్జీల ద్వారా అధికారులకు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

